క్లుప్తంగా

కాలిన విద్యుత్ సర్వీస్ మీటర్లు

పాకాల: దామలచెరువు పంచాయతీ మసీదు వీధి, బజారు వీధిలో గురువారం రాత్రి ఇంటి కరెంటు సర్వీస్ మీటర్లు కాలిపోవడంతో వీధులు చీకటిమయమయ్యాయి. గురువారం రాత్రి ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి సుమారు 20 సర్వీసు మీటర్లు కాలిపోయాయి. సమాచారాన్ని ట్రాన్స్‌కో ఏఈ జనార్దన్‌రావుకు తెలపడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని త్వరగా మరమ్మతులు చేసి కొత్త మీటర్లు ఏర్పాటు చేశారు. నీటి సరఫరాకు కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేశారు.

లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కీర్తన

పాకాల: కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లో సత్వరం పరిష్కరించుకోవాలని స్థానిక కోర్టు న్యాయమూర్తి జె.కీర్తన తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, కల్లూరు, చంద్రగిరి, పాకాల, పులిచెర్ల ఎస్ఈబీ, పోలీసులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మార్చి 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో కక్షిదారులతో మాట్లాడి ఎక్కువ కేసులు పరిష్కరించుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్, ఎస్ఐలు మహేష్‌బాబు, ఇషాక్‌బాష, రవిప్రకాష్‌రెడ్డి, పులిచెర్ల ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి ఎస్ఈబీ ఎస్ఐ జైశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటు



ఆటో స్టాండ్‌ను ప్రారంభిస్తున్న డ్రైవర్లు

చంద్రగిరి: స్థానిక మల్లయ్యపల్లి మార్గంలో ఇటీవల ప్రారంభించిన బ్లూ ల్యాండ్ వాటర్ పార్కుకు వచ్చే సందర్శకుల కోసం ఆటో డ్రైవర్లు శుక్రవారం నూతన ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. యూనియన్ అధ్యక్షుడిగా మొర గురుమూర్తి యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆటో యూనియన్ నాయకులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తిరుపతితో పాటు సుదూర ప్రాంతాల నుంచి వాటర్ పార్కుకు చేరుకోవడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి సరైన సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మునిచంద్ర రాయల్, బొడుగు రవి, త్యాగరాజు, విజయ్ కుమార్ రెడ్డి, లక్ష్మీపతి, గుణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పాకాల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రామ్మూర్తినాయుడు, డాక్టర్ వాసు తెలిపారు. మాలేపాటి నారాయణమ్మ, మాలేపాటి లక్ష్మయ్యనాయుడు జ్ఞాపకార్థం ఉచితంగా వైద్యశిబిరం నిర్వస్తున్నామని తెలిపారు. స్థానిక కళాశాలలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని తెలిపారు. ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్ద పీట



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సింహాల విమల

భాకరాపేట: జగనన్న ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని జంగావాండ్లపల్లె సర్పంచ్ సింహాల విమల తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండపల్లె పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న వైద్య సేవలను విస్తృతం చేయడంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలోనూ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా రోగులను గుర్తించి వారికి మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈవోపీఆర్‌డీ సోమశేఖర్ రెడ్డి, వైద్యాధికారులు బాబు అలెగ్జాండర్, యమున, సచివాలయ కార్యదర్శి నాగవేణి పాల్గొన్నారు.

27న ఎస్వీసీసీలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీసీసీ కళాశాలలో ఈ నెల 27న జాబ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, బీఫార్మసీ, పీజీ అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9177508279, 8074919939లో సంప్రదించాలని వెల్లడించారు.

జగనన్నతోనే మహిళా సాధికారత



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

- ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఏకైక నాయకుడు జగనన్న
- సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలోనూ సంతోషం
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి



చెవిరెడ్డి లక్ష్మికి స్వాగతం పలుకుతున్న మహిళలు

పాకాల: రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరగాలన్నా, ప్రజలకు నిష్పక్షపాతంగా పథకాలు అందాలన్నా సీఎంగా మరోసారి జగనన్న రావాలని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం ఓబులశెట్టివారి పల్లి, పెద్దహరిజనాడ, ఐయ్యవారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి గ్రామంలో జరిగిన అభివృద్ధిని, ప్రతి ఇంటికీ అందిన సంక్షేమాన్ని వివరించారు. జగనన్న పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, మహిళల సాధికారత సాధ్యమైందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇంటికి పెద్ద కొడుకుగా భావించి పండుగలతోపాటు నూతన వధూవరులకు పెళ్లి కానుకలను అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఆయన బాటలో కుమారుడు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పయనిస్తున్నాడని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి యథావిధిగా కొనసాగాలంటే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

దామలచెరువు పంచాయతీ కొత్తూరులో సీసీ రోడ్డు నిర్మానానికి చెవిరెడ్డి లక్ష్మి భూమి పూజ చేశారు. గ్రామంలో సుమారు రూ.19 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం సంతోషకరమన్నారు. పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఏవైనా పనులు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని, వాటిని కూడా త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, పార్టీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మునీశ్వర్ రెడ్డి, రఘుపతి, సర్పంచులు సునిత, గిరిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ లింగయ్య, ఎంపీటీసీ గౌతమి, రాజేంద్ర, సరేష్, పవన్‌కుమార్, ఇమ్రాన్, రహీం, హరిప్రసాద్‌రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, గుండ్లూరి సురేష్, వినాయక, హసీనా, జ్యోతిప్రసాద్‌రెడ్డి, ముకుందారెడ్డి, ఖాజామస్తాన్, కె.మస్తాన్, లక్ష్మీసుధ, రాజారెడ్డి, సురేంద్రరెడ్డి, రాజారాంనాయుడు, మనోహర్‌రెడ్డి, గణపతిరెడ్డి, మోహన్, బాబు, ఈశ్వర్, వెంకటేశ్, వాసు, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే జగనన్న లక్ష్యం



రంగన్నగారిగడ్డ పల్లెబాటలో పాల్గొన్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, చెవిరెడ్డి ఆకాష్‌రెడ్డి

భాకరాపేట: ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, చెవిరెడ్డి ఆకాష్‌రెడ్డి తెలిపారు. వారు శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ పంచాయతీలో పల్లెబాట చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పథకాలు అందజేస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికి చెందుతుందన్నారు. నవరత్నాల పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడినట్టు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖదీర్ అహ్మద్, సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, మనోహర్ ఎంపీటీసీ నిర్మల, డివిజన్ అధ్యక్షుడు అక్బర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, నరసింహారెడ్డి, రమణ, సుబ్రమణ్యం, కేశవరెడ్డి, ముబారక్‌అలీ, మహంసాహెబ్, బాలకృష్ణ, శివ, బాదుల్లా పాల్గొన్నారు.

నూతన కోర్టు భవనం అప్పగింత



భవనం తాళాలు అప్పగిస్తున్న అధికారులు

పాకాల: పాకాల–చిత్తూరు మార్గంలోని మొదటి రైల్వే గేటు వద్ద సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన కోర్టు భవనాన్ని శుక్రవారం ఆర్ అండ్ బీ డిప్యూటీ ఈఈ సూర్యనారాయణరెడ్డి న్యాయమూర్తి జె.కీర్తనకు అప్పగించారు. నూతన భవనం కోర్టు కార్యకలాపాలకు అనువుగా ఉంటుందని ఆర్ అండ్ బీ అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, సెక్రటరీ గౌరీశంకర్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ రెడ్డెప్పనాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, గురుస్వామినాయుడు, ప్రవీణ్, ప్రకాష్, చంద్రమోహన్, కోర్టు సిబ్బంది రాజేష్, శరవణ, ఆర్ అండ్ బి ఏఈ మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

కుమారధార తీర్థ ముక్కోటికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల: తిరుమలలో శనివారం జరగనున్న కుమారధార తీర్థ ముక్కోటికి టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై టీటీడీ నిఘా, భద్రతా విభాగం, పోలీసు అధికారులు శుక్రవారం తిరుమలలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమీక్ష నిర్వహించారు. శనివారం ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కుమారధార తీర్థానికి భక్తులను అనుమతిస్తారు. అధిక బరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లలు, వృద్ధులు నడిచి వెళ్లడానికి అనుమతి లేదు. గోగర్భం నుంచి పాపవినాశనం వరకు ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే అనుమతిస్తారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రయివేటు వాహనాలను అనుమతించరు. పాపవినాశనం నుంచి కుమారధార తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాపవినాశనం డ్యామ్ వద్ద ఉదయం 6 గంటల నుంచి భక్తులకు పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పాలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిని నియమించారు. మందులను అందుబాటులో ఉంచారు. ఈ సమీక్షలో తిరుమల అదనపు ఎస్పీ శివరామిరెడ్డి, వీజీవోలు నందకిషోర్, గిరిధర్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, ఈఈ–1 జగన్మోహన్ రెడ్డి, ఏవీఎస్వోలు గిరిధర్, మనోహర్, శివయ్య, శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జనం చెంతకే సంక్షేమం



సంక్షేమ పథకాల జాబితాను గ్రామస్తులకు అందజేస్తున్న చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి

రామచంద్రాపురం: జనం చెంతకే సంక్షేమ పథకాలు చేర్చుతున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయ కర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ధ్యానేష్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎన్టీఆర్ ఎస్టీకాలనీ, శాఖమూరి కండ్రిగ, కన్నికాపురం, కందులవారిపల్లి, ఎస్టీకాలనీ, బలిజపల్లి గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల జాబితాను లబ్ధిదారులకు అందించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఢిల్లీరాణి, ఎంపీటీసీ మునీంద్ర యాదవ్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు నాయుడు, తిరుచానూరు మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు బాబునాయుడు, పురుషోత్తం నాయుడు, రాజేష్ నాయుడు, ఈశ్వర్‌రెడ్డి, మహీరెడ్డి, యశ్వంత్, కవిత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందిద్దాం



కలెక్టర్ జి.లక్ష్మీశతో జెడ్పీ సీఈవో గ్లోరియా

తిరుపతి అర్బన్: రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అర్హులకు అందించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. నూతన జెడ్పీ సీఈవో గ్లోరియా శుక్రవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలో అమలు చేస్తున్న పథకాలను వందశాతం పేదలకు చేర్చాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నేడు తిరుపతిలో ట్రాఫిక్ మళ్లింపు

తిరుపతి క్రైమ్: తిరుపతి ఆవిర్భావ ఊరేగింపు సందర్భంగా నగరంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించినట్టు ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప తెలిపారు. తిరుపతి ఆవిర్భావ సభ ఊరేగింపు ఉదయం 7 గంటలకు గోవిందరాజ స్వామి ఆలయం వద్ద జీ-కార్ల వీధి నుంచి ప్రారంభమై కర్నాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా నాలుగు కాళ్ల మండపం ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాత్కాలికంగా ట్రాఫిక్‌ను మళ్లించినట్టు పేర్కొన్నారు.

- టౌన్ క్లబ్ నుంచి గాంధీ రోడ్డు వైపు వచ్చే వాహనాలు బాలాజీ కాలనీ అలిపిరి వైపు మళ్లింపు.
- మున్సిపల్ ఆఫీస్ సెంట్రల్ పార్క్ సిగ్నల్ నుంచి నాలుగు కాళ్ల మండపం వైపు వెళ్లే వాహనాలను ఇందిరా మైదానం, తుడా రోడ్డు వైపు మళ్లించారు.
- ఆర్సీ రోడ్డు అండర్ బ్రిడ్జ్ వైపు వెళ్లే వాహనాలను అన్నమయ్య కూడలి వద్దనే దారి మళ్లించారు.
- రైల్వే స్టేషన్ ప్రీపెయిడ్ టాక్సీ కౌంటర్ నుంచి కర్నాల వీధి వైపు వెళ్లకుండా విష్ణు నివాసం వైపు దారి మళ్లించారు.
- గోవిందరాజ స్వామి నాలుగు మాడ వీధులైన జీ-కార్ల వీధి, కర్నాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డులోకి వాహనాలకు అనుమతి లేదు. ఈ మాడ వీధులకు అనుసంధానంగా ఉన్న అన్ని దారులను తిరుపతి ఆవిర్భావ సభ వేడుకల ఊరేగింపు ముగిసేంత వరకు తాత్కాలికంగా మూసి వేస్తారు.
- కృష్ణాపురం ఠాణా దగ్గర ప్రకాశం రోడ్డు, చిన్న బజారు వీధి నుంచి గాంధీ రోడ్డులోకి వాహనాలకు అనుమతి లేదు.
- నాలుగు కాళ్ల మండపం కూడలి నుంచి తిలక్ రోడ్డు- బండ్ల వీధి వచ్చేదారులు మూసివేస్తారు.
- ఆంజనేయస్వామి గుడి పక్కన ఉన్న తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు రోడ్డు నుంచి జీ-కార్ల వీధిలోకి వాహనాలు రాకుండా మూసి వేస్తారు.
- భీమాస్ డీలక్స్ పక్కనున్న రోడ్డు నుంచి జీ-కార్ల వీధిలోకి వాహనాలు రాకుండా మూసి వేస్తారు.
- రైల్వే స్టేషన్ రోడ్డు మూసి వేస్తారు.
- ఆర్సీ రోడ్డు అండర్ బ్రిడ్జి ఇరువైపులా మూసి వేస్తారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని డీఎస్పీ కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

తిరుపతి రూరల్: న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని తిరుపతి వ్యవసాయ కళాశాల కాంట్రాక్టు ఉద్యోగులు కోరారు. వారు శుక్రవారం తుమ్మలగుంటలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన తుడా చైర్మన్ మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి



సీపీఐ నాయకులతో మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని కుంట్రపాకంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఐ నాయకులు కోరారు. వారు శుక్రవారం తుమ్మలగుంటలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కుంట్రపాకం గ్రామ లెక్కదాఖలా సర్వే నంబర్ 612లో 113 ఎకరాల్లో ఎట్టేరి గుట్ట ఉందన్నారు. అక్కడ గతంలో జగనన్న కాలనీ ఏర్పాటుచేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు ప్రయత్నించారని తెలిపారు. అవిలాలకు చెందిన సోంప్రకాష్ యాదవ్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకున్నాడని తెలిపారు. అక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేసినట్టు పేర్కొన్నారు. వాటిని రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి తొలగించాలని అడ్డుకున్నారని తెలిపారు. అక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సహకరించాలని కోరారు. స్పందించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రతి ఇంటిలోనూ సంక్షేమ వెలుగులు



ప్రజలకు సంక్షేమ పథకాల జాబితాను అందజేస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: జగనన్న పాలనలో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ వెలుగులు విరజిమ్మాయని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం సర్పంచ్ మల్లం దీపిక రెడ్డితో కలిసి తొండవాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు ప్రతి ఇంటా ఘన స్వాగతం లభించింది. ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా చెవిరెడ్డి కుటుంబం ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. కరోనా సమయంలో ప్రజలకు కుటుంబ సభ్యుడికంటే ఎక్కువగా సేవలు చేసినట్టు గుర్తు చేశారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన సేవలను గుర్తుంచుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

తొండవాడ పంచాయతీలో రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి తెలిపారు. సీసీ రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో రూ.కోటితో అండర్ డ్రైనేజ్ పనులు చేస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ యుగంధర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, వైస్ ఎంపీపీ నిరంజన్, పార్టీ మండల అధ్యక్షుడు మస్తాన్, డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, కుమార్, మహేస్, శివ పాల్గొన్నారు.

అభివృద్ధిని గుర్తించి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించండి



ఉదయమాణిక్యంలో పల్లెబాట చేపట్టిన చెవిరెడ్డి మంజుల

భాకరాపేట: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని గుర్తించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని చెవిరెడ్డి మంజుల కోరారు. ఆమె శుక్రవారం ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యం పంచాయతీలో పల్లెబాట కార్యక్రమం చేపట్టారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఆడబిడ్డగా గ్రామాల్లోకి వచ్చిన ఆమెను గ్రామ ప్రజలు అక్కున చేర్చుకున్నారు. హారతి పట్టి స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేసి నేరుగా లబ్ధిదారునికి అందజేస్తున్న ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని నమ్మిన వ్యక్తి జగనన్న అని వివరించారు. జగనన్న అధికారంలోకి రావాలంటే ఫ్యాను గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఊటుకూరి రెడ్డెమ్మ, సర్పంచ్ లక్ష్మీరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ శివలక్ష్మి, ప్రతాప్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, హేమంత్ కిశోర్‌రెడ్డి, శివరంజన్‌రెడ్డి, మునికృష్ణయ్య, హరినాథ్‌రెడ్డి, కృష్ణమూర్తి, రెడ్డెప్ప, గంగిరెడ్డి, బాలకృష్ణ, నాగరాజ, సుధీర్, వి.హరినాద్‌రెడ్డి, పెద్దరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి వైఎస్సార్‌సీపీ శ్రేణుల అండ



గాయపడిని గణపతిఆచారిని ఆసుపత్రికి తరలిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తిరుపతి రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడికి వైఎస్సార్ సీపీ శ్రేణులు అండగా నిలిచి సకాలంలో వైద్యం అందించిన ఘటన తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీలో శుక్రవారం చోటు చేసుకుంది. చంద్రగిరి మండలం కొటాలకు చెందిన గణపతి ఆచారి వృతిపరమైన వస్తువుల కోసం శుక్రవారం కొటాల నుంచి బైక్‌పై తిరుపతికి వస్తున్నాడు. పెరుమాళ్లపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గణపతిఆచారి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పుదిపట్ల పంచాయతీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మల్లారపు మహేంద్ర, వార్డు సభ్యులు మురళి, కార్యకర్తలు అక్కడికి చేరుకుని అతనికి ప్రథమ చికిత్స అందించారు. వెంటనే అంబులెన్స్‌ను తెప్పించి తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణుల సేవాభావానికి పలువురు ప్రయాణికులు అభినందించారు.